కుక్క కాటు.. నిర్లక్ష్యం చేటు!

- మూడేళ్లలో 13,286 మందికి కుక్కకాటు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా కుక్క కాటు మందు
- పీహెచ్‌సీల్లోనూ ఏఆర్‌వీ మందు
- అప్రమత్తతే అవసరమంటున్న వైద్యులు
- నేడు రేబీస్ వ్యాధి నివారణ దినం





కుక్కకాటుకు గురైన చిన్నారులకు ఏఆర్‌వీ ఇంజెక్షన్లు వేస్తున్న వైద్యసిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): అది మన మధ్యన తిరిగే సాదారణ జంతువే. మనతో ఎంతో విశ్వాసం చూపించే జీవి. అయితే దానికీ తిక్కుంది...దానికో లెక్కుంది అన్నట్లుగా అది కూడా అప్పుడప్పుడు మనిషి కరుస్తుంది. అది కరిస్తే మాత్రం నాలుగు వారాల పాటు ఆసుపత్రికి వెళ్లి సూదులేయించుకోక తప్పదు. లేకపోతే మనిషి కూడా కుక్కలాగా అరుస్తూ క్రమంగా మరణానికి దగ్గరవుతాడు. దీనినే రేబిస్ అంటారు. ఈ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు గాను ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 28న రేబిస్ వ్యాధి నివారణ దినంగా నిర్వహిస్తున్నారు.

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు ఎమ్మిగనూరు, ఆదోని ఏరియా ఆసుపత్రులు, ఐదు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 35 పీహెచ్‌సీలు, 28 అర్బన్ హెల్త్ సెంటర్లు, 426 సచివాలయాలు ఉన్నాయి. సచివాలయాలు మినహా ప్రతి పీహెచ్‌సీలో జనాభాను బట్టి 50 నుంచి 80 దాకా, సీహెచ్‌సీలో 200 దాకా, ఏరియా ఆసుపత్రుల్లో 500 దాకా, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వెయ్యి దాకా ఏఆర్‌వీ ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచుతున్నారు. ప్రస్తుతం కర్నూలు నగరంలో ఉన్న సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లోనూ 2 వేల ఏఆర్‌వీ వాయిల్స్ అందుబాటులో ఉన్నాయి. కుక్క కాటు మందుకు కొరత లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కుక్కలను పట్టుకెళ్లి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ నిర్వహించి తిరిగి వాటిని వదిలేస్తున్నారు. జిల్లాలో ఎక్కువగా కుక్క కాటు బాధితులు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వస్తున్నారు. ప్రతి నెలా 500లకు పైగా కొత్త కేసులు, వెయ్యికి పైగా పాత కేసులకు ఏఆర్‌వీ ఇంజెక్షన్లు వేస్తున్నారు. ఈ యేడాది ఇప్పటి వరకు 3,830 కొత్త వారికి, 8,849 మంది పాత వారికి ఏఆర్‌టీ(కుక్క కాటు మందు)ను వేశారు.

రేబిస్ వ్యాధి ప్రాణాంతకం

కుక్క కరిచిన తర్వాత శరీరంలో రేబిస్ వ్యాధికారక క్రిములు చేరాక వ్యాధి బయటపడే వ్యవధి నాలుగు నుంచి ఐదు రోజులు పడుతుంది. అయితే కుక్క ఎక్కడ కరిచింది, ఎంతో లోతు గాయమైంది, ఏ ప్రాంతంలో కరిచింది, దుస్తులపై కరిచిందా, నేరుగా కరిచినప్పుడు ఎంత మేరకు వైరస్ శరీరంలోకి ప్రవేశించిందన్న దానిపై వ్యాధి తీవ్రత ఆధారపడి ఉంటుంది. కుక్కకాటు తర్వాత వైరస్ శరీరంలోని కండరాల్లోకి వెళ్లి అక్కడ అభివృద్ధి చెంది నరాల్లోకి ప్రవేశిస్తుంది. ఆ తర్వాత నరాల్లో నుంచి మెదడుకు వెళ్తుంది. అక్కడ నుంచి కణాల సముదాయంలోకి, కండరాల్లోకి, ఎముకలు, గ్రంథుల్లోకి వెళ్లి లాలాజలంలో ప్రవేశిస్తుంది. స్కిన్ బయాప్సీ, లాలాజలం ద్వారా ఈ వైరస్‌ను నిర్ధారిస్తారు.

రేబిస్ వ్యాధి నిర్ధారణ

ఈ వ్యాధికి స్పష్టమైన చికిత్స లేదని వైద్యులు చెబుతున్నారు. అయితే కుక్కకాటుకు గురైన సందర్భాల్లో వైద్యులు ఇచ్చే వ్యాక్సిన్ వల్ల రేబిస్ రాకుండా కాపాడుకోవచ్చు. కుక్కకాటు తర్వాత పదిరోజుల పాటు ఎలాంటి లక్షణాలు కనిపించకపోతే ఆందోళన చెందాల్సిన పనిలేదు. కరిచిన పదిరోజుల్లోగా కుక్క చనిపోతే దానికి వైరస్ ఉందని భావించాలి. ఇలాంటి కుక్కలు మనిషికి ఉన్న పుండ్లు, గాయం ఉన్న చోట నాకినా, కొరికినా రేబిస్ వచ్చే ప్రమాదం ఎక్కువ.

రేబిస్ వ్యాధి లక్షణాలు

కుక్క కరిచిన ప్రాంతంలో నొప్పితో పాటు తల, ఒళ్లు, గొంతు నొప్పి, సాధారణ జ్వరం ఉంటాయి. ఈ లక్షణాల తర్వాత వైరస్ మెదడును తీవ్రమైన ఉద్వేగాలకు లోనయ్యేలా చేస్తుంది. దీంతో గాలికి భయపడతారు. దీనిని ఏరో ఫోబియో అంటారు. నీళ్లను చూసినా వణికిపోతారు. ఈ కండీషన్‌ను హైడ్రోఫోబియా అంటారు. గొంతులోని కండరాలు బిగుసుకుపోతాయి. ఈ పరిస్థితుల్లో రోగిని ఆసుపత్రిలో చేర్పాలి. లక్షణాలను బట్టి వైద్యులు చికిత్స అందిస్తారు.

కుక్కకాటు బాధితులు

సంవత్సరం	కుక్కకాటు బాధితులు
2021	3,533
2022	5,333
2023	4,411

కుక్కకరిస్తే ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- కుక్కకాటుకు గురైన వారు తప్పనిసరిగా యాంటి రేబిస్ వ్యాక్సిన్(ఏఆర్‌వీ) వేయించుకోవాలి.
- వీరికి మొదటి, మూడవ, ఏడవ, 14వ, 30వ రోజుల్లో వ్యాక్సిన్ వేస్తారు. కుక్క గాటుకు గురైందన్న అనుమానం ఉన్న వారికి మొదటి, మూడవ రోజున వ్యాక్సిన్ వేస్తారు.
- కుక్కే కాదు పంది, పందికొక్కులు, కోతులు, గాడిదలు, గుర్రాలు, గబ్బిలాలు, ఎలుకలు, పిల్లులు వంటి జంతువులు కరిచినా ఏఆర్‌వీ వ్యాక్సిన్ వేయించుకోవాలి.
- గాయం పెద్దగా ఉంటే ఏఆర్‌వీతో పాటు ఖరీదైన ఇమ్యునోగ్లోబిలిన్స్ ఇంజెక్షన్ కూడా కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో బాధితులకు ఉచితంగా ఇస్తున్నారు.
- కుక్క కరిచిన వెంటనే గాయాన్ని శుభ్రంగా కడగాలి. అనంతరం వైద్యుని వద్దకు వచ్చి చికిత్స తీసుకోవాలి. అతి పెద్ద గాయాలైతేనే కట్టుకట్టాలి. చిన్న గాయాలను కట్టుకట్టకుండా వదిలేయాలి.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో వ్యాక్సిన్ ఉచితం



కుక్క కాటుకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏఆర్‌వీ వ్యాక్సిన్‌ను సిద్ధంగా ఉంచాం. అక్కడి జనాభాను బట్టి ప్రతి పీహెచ్‌సీలో 50 నుంచి 80, యూపీహెచ్‌సీల్లో 40 దాకా వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నాయి. ఎవ్వరికైనా అవసరమైతే జిల్లా కేంద్రానికి వచ్చి తీసుకెళ్లి నిల్వ చేసుకునే సౌకర్యం కల్పించాం. ఎక్కడా వ్యాక్సిన్‌కు డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం ఉచితంగా ఖరీదైన ఏఆర్‌వీ ఇంజెక్షన్లు ప్రజలకు అందుబాటులో ఉంచింది. ప్రజలు సైతం కుక్కకాటు పట్ల నిర్లక్ష్యంగా ఉండకుండా అవి కరిచిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వ్యాక్సిన్ వేయించుకోవాలి.

–డాక్టర్ బి.రామగిడ్డయ్య,డీఎంహెచ్‌ఓ, కర్నూలు

కుక్కల పట్ల జాగ్రత్తగా ఉండాలి



కుక్కకాటును ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయకూడదు. ఇందులో మూడు కేటగిరిలు ఉన్నాయి. కుక్క లాలాజలం తాకినా, అది మూతి తాకించినా మొదటి కేటగిరి, మనిషి పై చర్మాన్ని పట్టుకుంటే రెండో కేటగిరి. ఈ రెండింటికీ ఏఆర్‌వీ వ్యాక్సిన్ వేస్తాం. మనిషిని రక్తం వచ్చేలా కరవడం మూడో కేటగిరి కిందకు వస్తుంది. దీనికి ఇమ్యునోగ్లోబిన్స్ ఇవ్వాల్సి ఉంటుంది. కుక్క కరిచినా ఏమీ కాదులే అని కొందరు రెండు, మూడు రోజులు ఆలస్యంగా వస్తారు. అలాంటి వారికి మొదటి రోజు డబుల్ డోస్ వ్యాక్సిన్ ఇస్తాం. పెంపుడు కుక్కలు ఉన్నవారు కుటుంబ సభ్యులందరూ వ్యాక్సిన్ వేయించుకోవాలి. కుక్కకూ వ్యాక్సిన్ వేయించాలి.

– డాక్టర్ సయ్యద్ ఇమ్రాన్ ఖాద్రి, అసిస్టెంట్ ప్రొఫెసర్, జనరల్ మెడిసిన్, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల

క్లుప్తంగా

రేపు వరల్డ్ హార్ట్ డే



మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29న వరల్డ్ హార్ట్ డే వేడుకలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్ చెప్పారు. బుధవారం సాయంత్రం ఎ.క్యాంపులోని హెల్త్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా 29న సాయంత్రం 'జీవనశైలి మార్పులు, హృదయ సంబంధిత వ్యాధులు విజృంభించేందుకు ఎలా దారి తీశాయి' అంశంపై తమిళనాడులో క్రిష్టియన్ మెడికల్ కాలేజీ(వేలూరు) సీనియర్ ఇంటర్ వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ జార్జ్ జోసఫ్ ప్రసంగిస్తారన్నారు. కార్యక్రమానికి రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ హాజరవుతారన్నారు. సమావేశంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ భవానీ ప్రసాద్, కల్యాణ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

29న జర్నలిస్టులకు ఉచిత మెడికల్ క్యాంపు

కర్నూలు(సెంట్రల్): ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కిమ్స్ హాస్పిటల్ పర్యవేక్షణలో ఈనెల 29వతేదీన జర్నలిస్టులకు ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.జయమ్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని డీపీఆర్‌ఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించే మెడికల్ క్యాంపులో ఉచితంగా బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలను నిర్వహిస్తారు. కిమ్స్ వైద్యశాల కార్డియాలజిస్టు నాగేంద్ర ప్రసాదు పర్యవేక్షణలో నిర్వహించే క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

1న జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక ఏ.క్యాంపు మాంటిస్సోరి పాఠశాల క్రీడా మైదానంలో అక్టోబర్ 1న జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి కె.విజయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్ కార్డు, 4 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు రూ. 10 ప్రవేశ రుసుంతో హాజరుకావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 16 నుంచి 18 వ తేదీ వరకు ఆళ్లగడ్డలో నిర్వహించనున్న అంతర్ జిల్లాల సీనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. మరిన్ని వివరాలకు 7032088888 సంప్రదించాలన్నారు.

క్లాప్ డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): తొలగించిన క్లాప్ డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలని సీపీఎం నాయకులు పి.నిర్మల, పీఎస్ రాధాకృష్ణ కలెక్టర్ డాక్టర్ జి.సృజనను కోరారు. బుధవారం వారు కలెక్టర్‌ను ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 9 నెలలుగా జీతాలు లేకుండా పనిచేసే వారిని హఠాత్తుగా తొలగించారని, ఒప్పందం చేసుకున్న ఏజెన్సీతో పెండింగ్ జీతాలను ఇప్పించాలన్నారు. కర్నూలు కార్పొరేషన్‌లో 98 మంది క్లాప్ ఆటోలకు డ్రైవర్లు పనిచేస్తున్నారన్నారు.అందుకు కలెక్టర్ స్పందించి విషయాన్ని కమిషనర్‌తో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

మచ్చలేని నాయకుడు కోట్ల

కర్నూలు(సెంట్రల్): రాజకీయాల్లో మచ్చలేని నాయకుడు ఎవరైనా ఉన్నారంటే అది మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి అని డీసీసీ అధ్యక్షుడు ఎం.సుధాకరబాబు అన్నారు. బుధవారం కోట్ల వర్ధంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ నాయకులు ముందుగా ఆయన కాంస్య విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటాన్ని ఉంచి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బతుకన్న, బజారన్న, షేక ఖాజా హుస్సేన్, ప్రమీళ, సత్యరాజు, రియాజుద్దీన ఎజాస్, ఎస్ఎం ఖాద్రి పాల్గొన్నారు.

ఖాజా హుస్సేన్ సేవలు మరువలేనివి



అమీనాబీకి ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): సీపీఐ నగర కార్యవర్గ సభ్యుడు ఖాజా హుస్సేన్ సేవలు మరువలేమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన ఖాజా హుస్సేన్ సంస్మరణ సభను బుధవారం సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గిడ్డయ్య మాట్లాడుతూ ఖాజాహుస్సేన్ మరణం పార్టీకి తీరని లోటన్నారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు పార్టీ తరఫున రూ.55 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఖాజా హుస్సేన్ భార్య అమీనాబీ, నాయకులు పి.జగన్నాథం, రామకృష్ణారెడ్డి, మహేష్, చంద్రశేఖర్, వెంకటేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి



పార్కుల అభివృద్ధి గురించి ఆరా తీస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): వచ్చే నెల 15 లోపు నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశించారు. బుధవారం సీతారామనగర్, చిల్డ్రన్స్ పార్కు, రామలింగేశ్వర్ నగర్ తదితర కాలనీలలో చేపడుతున్న పనులను తనిఖీ చేశారు. పనుల పురోగతిపై మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శేషసాయి, డీఈఈ రాజశేఖర్‌లను అడిగి తెలుసుకున్నారు.

నగరపాలక సంస్థ పరిధిలో పోలింగ్ కేంద్రాలపై ఏవైనా అభ్యర్థనలు ఉంటే తెలియజేయాలని అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ సూచించారు. బుధవారం స్థానిక నగరపాలకలోని అడిషనల్ కమిషనర్ తన చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో పోలింగ్ స్టేషన్లకు సంబంధించి ఓటర్లకు ఇబ్బందులుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అందరికీ ఆమోదయోగ్యమైన చర్యలు చేపడతామన్నారు. సమావేశంలో అర్బన్ మండల రెవెన్యూ అధికారి విజయశ్రీ పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్‌గ్రాంట్ చెల్లించాలి

కర్నూలు కల్చరల్: సెకండరీ విద్య స్కూల్ కాంప్లెక్స్ గ్రాంట్ బకాయిలు, ఎంటీఎస్–2 జీతాలను చెల్లించాలని కోరుతూ ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు యాదవ్, ప్రధాన కార్యదర్శి నారాయణ తదితరులు బుధవారం జిల్లా విద్యా శాఖాధికారి డాక్టర్ వి.రంగారెడ్డికి వినతి పత్రం అందజేశారు.

మీటర్ రీడర్లకు భద్రత కల్పించాలి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ శాఖలో పనిచేస్తున్న మీటర్ మీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ నగర కార్యదర్శి సాయిబాబా కోరారు. బుధవారం సంఘం ఆధ్వర్యంలో కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతిని కలిసి వినతిపత్రం అందజేశారు.

దరఖాస్తులు పరిష్కరించండి

కర్నూలు (టౌన్): భవనాలు, లేఅవుట్ల క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని పట్టణ ప్రణాళిక విభాగం సిటీ ప్లానర్ మీనా కుమారి సూచించారు. బుధవారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాల్‌లో పట్టణ ప్రణాళిక సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నిర్లక్ష్యం చేస్తే లైసెన్స్‌డ్ ఇంజినీర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

ఓపీఎస్‌కు అంగీకరించం

కర్నూలు కల్చరల్: ఓపీఎస్‌ను అంగీకరించేది లేదని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న అన్నారు. ఓపీఎస్ బిల్లును నిరసిస్తూ కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో జీపీఎస్ బిల్లును ఆమోదించిన ఈ రోజు సీపీఎస్ ఉద్యోగులకు చీకటి రోజు అన్నారు. అనంతరం జీపీఎస్ ప్రతులను తగలబెట్టారు.కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గోకారి, జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్థన్ తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను ఆమోదిస్తూ రాష్ట్ర అసెంబ్లీలో బిల్లును ఆమోదించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆప్టా రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గణపతి రావు, ప్ర కాష్‌రావు సంయుక్త ప్రకటనలో తెలిపారు. సీపీఎస్ ఉ ద్యోగులకు బుధవారం చీకటి రోజుగా అభివర్ణించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా కోరారు. బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలు ఇవ్వాలని, మధ్యాహ్న భోజనం పెట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అమర్, రవి, మల్లేష్, భరత్, గౌస్, పోతురాజు, అంజి పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

కర్నూలు(సెంట్రల్): విద్యుత్ చార్జీలను తగ్గించాలని వామపక్షాలు డిమాండ్ చేశాయి. బుధవారం సీపీఎం, సీపీఐ నగర కార్యదర్శులు పి.రామకృష్ణారెడ్డి, టి.రాముడు అధ్యక్షతన వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు బి.గిడ్డయ్య, డి.గౌస్‌దేశాయ్‌లు మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యుత్ విధానంతో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. విద్యుత్ మోటార్లకు మీటర్లను బిగించకూడదన్నారు.ఉచిత విద్యుత్‌ను కొనసాగించేందుకు మీటర్ల బిగింపు ప్రశ్నార్థకం మిగిలిపోయిందన్నారు. మరో వైపు ట్రూ అప్ చార్జీల పేరుతో వినియోగదారులపై అధికంగా బిల్లులు వేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.నిర్మల, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు మల్లికార్జున, ఎస్‌యూసీఐ జిల్లా నాయకులు నాగన్న పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీని పటిష్టంగా అమలు చేయాలి



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ఆరోగ్యశ్రీని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మరింత పటిష్టంగా అమలు చేయాలని సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి సూచించారు. బుధవారం ఆయన ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో వివిధ విభాగాల హెచ్‌ఓడీలతో ఆరోగ్యశ్రీ, కేస్‌షీట్‌ల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఆరోగ్యశ్రీ క్లెయిమ్ కేసుల అప్‌లోడింగ్‌లో లక్ష్యాలను చేరుకున్న డెర్మటాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, న్యూరోసర్జరీ, ఆర్థోపెడిక్, పల్మనాలజీ విభాగాలను అభినందించారు. ప్రతి మంగళవారం ఆరోగ్యశ్రీపై సమీక్ష నిర్వహిస్తామని, ఇతర విభాగాలు కూడా త్వరగా లక్ష్యాలను చేరుకోవాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

న్యాయవాదుల సంఘం నిరసన



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కర్నూలు(లీగల్): భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోరుతూ న్యాయవాదులు బుధవారం కర్నూలు బార్ అసోసియేషన్ ఎదుట ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. కార్యక్రమానికి ఐఏఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.రంగనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ఎస్.రవికాంత్ ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కరోనా సమయంలో న్యాయవాదులకు రూ.100 కోట్లు ప్రకటించిందని, అందులో రూ.25 కోట్లు మాత్రమే విడుదల చేసిందని, మిగతా రూ.75 కోట్లు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగభూషణం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

యువత సమాజ సేవలో భాగస్వామ్యం కావాలి



మొక్క నాటుతున్న రిజిస్ట్రార్ బాయినేని శ్రీనివాసులు

కర్నూలు (న్యూసిటీ): యువత సమాజ సేవలో భాగస్వామ్యం కావాలని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ బాయినేని శ్రీనివాసులు తెలిపారు. ఎన్ఎస్ఎస్ డే సందర్భంగా బుధవారం యూనివర్సిటీ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జేఎండీ షఫీ, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ వెంకటప్ప పాల్గొన్నారు.

గ్యాస్ లీకై అగ్నిప్రమాదం

కర్నూలు: స్థానిక చిన్న మార్కెట్ నేతాజీ వీధిలో నివాసముంటున్న చంద్రకంటి సుజాత ఇంట్లో గ్యాస్ లీకేజీ వల్ల అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. బుధవారం ఉదయం సుజాత ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు చెలరేగి ఇల్లు మొత్తం కాలిపోయింది. సుమారు రూ.లక్ష దాకా ఫర్నీచర్ అగ్నికి ఆహుతి అయ్యింది. కర్నూలు ఫైర్ స్టేషన్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఒకటవ పట్టణ సీఐ నాగశేఖర్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. సుజాత భర్త చంద్రకంటి శ్రీధర్ శర్మ పౌరోహిత్యం ద్వారా సాగిస్తున్నారు. అగ్నిప్రమాదంలో ఫర్నీచర్ మొత్తం కాలిపోవడమే కాక సుజాతకు కూడా మంటలు వ్యాపించి తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆమె ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఒకటవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల 'మేరీ మిట్టీ మేరీ దేశ్' ర్యాలీ

కర్నూలు కల్చరల్: ఆజాదీ కా అమృత్ మహోత్సవం 'మేరీ మిట్టీ మేరీ దేశ్' కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రభుత్వ ఉర్దూ స్కూల్ విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. పాఠశాల నుంచి ఓల్డ్ టౌన్ చౌక్, బొంగుల బజార్, మించిన్ బజార్, గడియారం ఆసుపత్రి మీదుగా ర్యాలీ సాగింది. హెచ్ఎం పుష్పరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అండర్-19 ఎస్‌జీఎఫ్ పోటీలు ప్రారంభం

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో బుధవారం స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 రెజ్లింగ్, క్రికెట్, ఫెన్సింగ్, ఆర్చరీ, చెస్ ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి జమీర్‌బాషా మాట్లాడుతూ చదువుకే పరిమితం కాకుండా క్రీడలకు సమయం కేటాయించాలన్నారు. క్రీడల్లో రాణించే క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం క్రీడా పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ అండర్ –19 కార్యదర్శి పద్మావతి, ఆర్చరీ సంఘం నాయకులు నాగరత్నమయ్య పాల్గొన్నారు.

కర్నూలు విద్యుత్ ఇన్‌చార్జ్ ఈఈగా ఓబులేసు

కర్నూలు(రాజ్‌విహార్): దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు టౌన్ ఆపరేషన్స్ ఇన్‌చార్జ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా ఓబులేసుకు బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ రెగ్యులర్ విధులు నిర్వహిస్తున్న ఎస్.రమేష్‌ను వైఎస్ఆర్ జిల్లా కడపలోని మీటర్స్ విభాగానికి బదిలీ చేయగా తిరుపతి ప్రధాన కార్యాలయంలో కమర్షియల్ విభాగం ఈఈ చక్రపాణిని ఇక్కడి బదిలీ చేశారు. కాగా ఈయన రావడానికి ఇష్టపడటం లేదని తెలుస్తోంది. రమేష్ బుధవారం రిలీవ్ కావడంతో విద్యుత్ భవన్ టెక్నికల్ విభాగం ఈఈ ఓబులేసుకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన బాధ్యతలు చేపట్టారు.

బిల్లుల వసూలుపై దృష్టి పెట్టండి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ బిల్లుల వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి సూచించారు. బుధవారం ఆయన కింది స్థాయి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. నెలవారి బిల్లులు 100 శాతం రాబట్టేందుకు ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఏఈలు ప్రత్యేక ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. మొండి బకాయిలను ఎలాగైనా రాబట్టాలని, ప్రభుత్వ శాఖలకు సంబంధించి ఎప్పటికప్పుడు ఆయా అధికారులతో మాట్లాడి వసూలు అయ్యేలా చూడాలని సూచించారు.

బిల్లులు కట్టకపోతే కనెక్షన్లు కట్

విద్యుత్ బిల్లులు చెల్లించకపోతే కనెక్షన్లు తొలగిస్తామని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గడువు ముగిసినా చాలామంది బిల్లులు చెల్లించలేదని, వీరి సౌకర్యార్థం కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు గురువారం సెలువు అయినా పనిచేస్తాయని పేర్కొన్నారు.

నగరపాలక డీఈఈగా డీవీ కృష్ణలత

కర్నూలు (టౌన్): నందికొట్కూరు మున్సిపాల్టీ అసిస్టెంట్ ఇంజినీర్ డీవీ క్రిష్ణలతకు పదోన్నతి లభించింది. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పదోన్నతి కల్పిస్తూ కర్నూలు నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగానికి బదిలీ చేస్తూ చీఫ్ ఇంజినీర్ ఆనందరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కుడా డీఈఈగా పి.శ్రీకాంత్ బాబు

కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పి.శ్రీకాంత్‌బాబు నియమితులయ్యారు. గుంతకల్లు మున్సిపాల్టీ అసిస్టెంట్ ఇంజినర్‌గా ఉన్న ఆయనకు ప్రభుత్వం పదోన్నతి కల్పిస్తూ కుడాకు బదిలీ చేసింది.